సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం ၊ 2 ၊ అక్టోబర్ ၊ 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 28.114 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 5,891 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.59,200
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,335
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,495
నవర (8 గ్రా) -	రూ.43,960

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.8 /30.5

ఆదివారం గాలిలో తేమ 66 శాతం ఉంది. సోమవారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ పింఛన్ కానుక 73.94 శాతం పంపిణీ



కలిగిరిలో బందారు చిన్నమాలకొండయ్యకు పింఛన్ అందించేందుకు బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ సతు కామేశ్వరి

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక ప్రక్రియ జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. ఆదివారం సెలవు రోజైనప్పటికీ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. మొదటి రోజు 73.94 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుక పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా 3,17,722 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక అందించాల్సి ఉండగా తొలిరోజు 2,34,911 మందికి వలంటీర్లు వేకువజాము నుంచే పంపిణీ చేశారు. అవ్వాతాతల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందించడంతో పాటు కార్మికులు, వ్యవసాయ కూలీలు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది.

బాబోయ్.. కృష్ణా ఎక్స్‌ప్రెస్



ఆదివారం 3 గంటలు ఆలస్యంగా బిట్రగుంటకు చేరుకున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్

బిట్రగుంట: తిరుపతి నుంచి ఆదిలాబాద్ వెళ్లే 17405 నంబర్ గల కృష్ణా ఎక్స్‌ప్రెస్ పేరు చెబితేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. ప్రతి రోజూ గంటల తరబడి ఆలస్యంగా వస్తుండడం, ప్యాసింజర్ రైలు కన్నా ఘోరంగా ఎక్కడపడితే అక్కడ నిలిపేస్తుండడంతో ప్రయాణికులు రైలు ఎక్కాలంటేనే భయపడుతున్నారు. కొద్దిరోజులుగా కృష్ణా ఎక్స్‌ప్రెస్ మూడు, నాలుగు గంటలు ఆలస్యం కావడం సర్వసాధారణంగా మారింది. దీంతో ట్రెయిన్ ఏరోజు ఏ టైంకి వస్తుందో తెలియక ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. బిట్రగుంట, కావలి ప్రాంతాల నుంచి ప్రైవేట్ ఉద్యోగులు, చిరువ్యాపారులు, కూలీలు నిత్యం కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లోనే ఒంగోలుకు వెళుతుంటారు. అదేవిధంగా తిరుమలలో శ్రీవారి దర్శనం చేసుకున్న భక్తులు కూడా విజయవాడ, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుంటారు. ఇంతటి కీలకమైన ఈ రైలు ప్రతిరోజూ గంటల తరబడి ఆలస్యంగా వస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆదివారం కూడా సుమారు 3 గంటలు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు రైల్వే తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఉదయం 8.30 గంటలకు రావాల్సిన రైలు మూడు గంటలు ఆలస్యంగా 11.40 గంటలకు వచ్చింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జవాబుదారీతనం లోపించిందని ప్రయాణికులు మండిపడుతున్నారు.

5 నుంచి ఇన్‌స్టెంట్ పరీక్షలు

వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి ఇన్‌స్టెంట్ పరీక్షలు ప్రారంభమవుతాయని ఆ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి నాలుగు సెమిస్టర్లలో ఉత్తీర్ణులైన 300 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు అర్హులని, పరీక్షలు పూర్తయిన 10 రోజుల లోపు ఫలితాల విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బారకాసు): జిల్లాలోని అరబిందో ఎమర్జెన్సీ 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్(ఈఎంటీ) పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ ఎం.పవన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్‌ఎం, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ లైఫ్‌సైన్స్‌లో ఐదేళ్ల అనుభవంతో కూడిన క్యాత్‌ల్యాబ్, డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, అనస్తీషియా టెక్నీషియన్ తదితర కోర్సులు చేసిన వారు ఈ పోస్టుకు అర్హులని తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 5వ తేదీ లోపు నెల్లూరులోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న 108 కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9642027098 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రైతు పంట పండింది

- ఖరీఫ్‌లో పెరిగిన దిగుబడి
- ధాన్యానికి గిట్టుబాటు ధరలు
- కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు
- జిల్లాలో అధికంగా కేఎన్‌ఎం రకం వరి సాగు
- గిట్టుబాటు ధరలతో రైతుల సంతృప్తి

జిల్లాలో ఖరీఫ్‌లో వరి సాగు విస్తీర్ణం - 1.05 లక్షల ఎకరాలు

రకం	సాగు
కేఎన్‌ఎం 1638 రకం	70 శాతం సాగు
కేఎన్‌ఎం 733 రకం	10 శాతం సాగు
ఎంటీయూ 1010 రకం	15 శాతం సాగు
ఎన్‌ఎల్‌ఆర్ 34449 రకం	5 శాతం సాగు

ఈ ఏడాది ఎర్లీ ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన వరి పంట అధిక దిగుబడులు ఇచ్చింది. అన్నదాతలు పండించిన ధాన్యానికి ప్రస్తుతం మంచి ధరలు లభిస్తుండడంతో కల్లాల్లోనే విక్రయించి లాభాలు పొందుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పనిలేకుండా మిల్లర్లే కల్లాల వద్దకు వచ్చి గిట్టుబాటు ధరలు చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు.



పొదలకూరు మండలం తాటిపర్తి గ్రామం వద్ద రోడ్లపైనే ధాన్యాన్ని తూకం వేస్తున్న మిల్లర్లు

పొదలకూరు: జిల్లాలో ఎర్లీ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట వల్ల రైతులు ఆర్థిక స్వావలంబన పొందుతున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభిస్తుండడంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా జిల్లాలో రబీ సీజన్‌లో రైతులు అధిక విస్తీర్ణంలో వరి సాగు చేస్తుంటారు. ఖరీఫ్‌లో వరి సాగు విస్తీర్ణం తక్కువగా ఉంటుంది. అపరాల సాగు బాగా తగ్గిన తర్వాత నీటి వసతి ఉన్న మండలాల్లో ఈ ఏడాది రైతులు వరి సాగుకే ప్రాధాన్యం ఇచ్చి లాభాల బాట పట్టారు. ప్రస్తుతం ధాన్యానికి మిల్లర్లు అందిస్తున్న ధరలు కూడా బాగానే ఉన్నాయని రైతులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రం జాఫర్‌ఖాన్‌పేట కూనారం వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఉత్పత్తి చేసిన కేఎన్‌ఎం-1638 వరి వంగడాన్ని జిల్లా రైతులు అత్యధికంగా సాగు చేశారు. దోమపోటును తట్టుకుని 125 రోజులకు పంట దిగుబడి సాధించే కేఎన్‌ఎం-1638 రకాన్ని రైతులు సాగు చేసేందుకు మక్కువ చూపారు. ఈ రకం వరి వంగడం ఖరీఫ్, రబీ సీజన్లలో అధిక దిగుబడినిస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ రకం ఎకరానికి 50 బస్తాల(బస్తాకు 73 కిలోలు) వరకు దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అలాగే ఈ రకం ధాన్యానికి ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు కూడా బాగున్నాయని అన్నదాతలు తెలిపారు. కేఎన్‌ఎం-1638 వరి వంగడంతోపాటు కేఎన్‌ఎం-733 రకం, ఎంటీయూ-1010 రకం, ఎన్‌ఎల్‌ఆర్-34449 రకం వరి వంగడాలను జిల్లాలోని రైతులు సాగు చేశారు. ఎంటీయూ-1010 రకం సాగును వ్యవసాయాధికారులు ప్రోత్సహించకున్నా పొదలకూరు మండలంలోని తాటిపర్తి తదితర ప్రాంతాల్లోని రైతులు సాగు చేశారు. ఈ రకం ధాన్యాన్ని బొరుగులు తయారు చేసేందుకు ఉపయోగిస్తుండడంతో ధరలు కూడా బాగున్నాయని రైతులు చెబుతున్నారు. పొదలకూరు మండలంలోని రైతులు ఈ సీజన్‌లో 2,500 ఎకరాల్లో వరి సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించారు.

గిట్టుబాటు ధరలు

ఈ ఏడాది ఎర్లీ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1.05 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలతో పనిలేకుండా మిల్లర్లే కల్లాల వద్దకు వచ్చి గిట్టుబాటు ధరలు చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం కేఎన్‌ఎం-1638, కేఎన్‌ఎం-733 రకం ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేసి తరలిస్తున్నారు. ఎంటీయూ-1010 రకం ధాన్యం దిగుబడి అయి రైతులు విక్రయిస్తున్నారు. కేఎన్‌ఎం-1638 రకం ధాన్యం పుట్టి(860 కేజీలు) రూ.19 వేలు పలుకుతోంది. అలాగే కేఎన్‌ఎం-733 రకం ధాన్యం పుట్టి రూ.19,500, ఎంటీయూ-1010 రకం ధాన్యం పుట్టి రూ.18 వేలు, ఎన్‌ఎల్‌ఆర్-34449 రకం ధాన్యం పుట్టి రూ.17 వేలు పలుకుతున్నాయి. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభిస్తుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యానికి ధరలు బాగున్నాయ్



ఖరీఫ్ సీజన్‌లో పండిన ధాన్యానికి ప్రస్తుతం ధరలు బాగున్నాయి. మిల్లర్లే గిట్టుబాటు ధరలు అందిస్తున్నారు. రైతులు అధిక విస్తీర్ణంలో కేఎన్‌ఎం-1638 రకాన్ని సాగు చేశారు. దళారుల వ్యవస్థ లేకుండా నేరుగా మిల్లర్లే వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసి తీసుకుని వెళుతున్నారు.

– కె.రమణారెడ్డి, రైతు, మహ్మదాపురం

ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులు లేవు



సాగునీటి సమస్యలు లేకపోవడంతో వరి సాగుకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట అధిక దిగుబడులు ఇచ్చింది. గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహం బాగా ఉంది.

– ఎం.మోహన్‌రాజు, రైతు, దుగ్గుంటరాజుపాళెం

దిగుబడులు బాగు



ఎర్లీ ఖరీఫ్‌లో వరి దిగుబడి బాగుంది. సాధారణంగా ఖరీఫ్‌లో దిగుబడి రబీ సీజన్ కన్నా తక్కువగా ఉంటుంది. అయితే ప్రస్తుతం దిగుబడిలో తేడా కనిపించలేదు. రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. ధాన్యాన్ని విక్రయించుకోవడంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదు.

– కె.శివనాయక్, ఏడీఏ, పొదలకూరు

జాతిపిత అడుగుజాడల్లో నడుద్దాం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు(దర్గామిట్ట): సత్యం, అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాలతో మన దేశానికి స్వాతంత్య్రాన్ని తెచ్చిపెట్టిన జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరం నడుద్దామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంత్రి మాట్లాడుతూ సోమవారం గాంధీ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆయనను స్మరించుకోవాలని, ఘన నివాళులర్పించాలని పేర్కొన్నారు.

మహాత్ముని అహింసా ఉద్యమం స్ఫూర్తిదాయకం

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు(దర్గామిట్ట): మహాత్మాగాంధీ చేపట్టిన అహింసా ఉద్యమం ప్రపంచానికే స్ఫూర్తిదాయకంగా నిలిచిందని, ప్రతి ఒక్కరం మహాత్ముని అడుగుజాడల్లో నడుద్దామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవాలని, గాంధీజీ బాటలోనే మనమంతా పయనిస్తూ గ్రామ స్వరాజ్య సాధనకు పాటుపడాలని ఆకాంక్షించారు.

నేటి జగనన్నకు చెబుదాం రద్దు

నెల్లూరు(దర్గామిట్ట): అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో నెల్లూరు కలెక్టర్‌లో, మండల కార్యాలయాల్లో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం జరగదని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు దీనిని గమనించాలని కోరారు.

చంద్రబాబు అవినీతి మోత మోగింది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): స్కిల్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్ అయి జైలులో ఉన్న నేపథ్యంలో టీడీపీ నాయకులు చేపట్టిన మోత మోగిద్దాం అనే కార్యక్రమం ద్వారా ఆయన అవినీతి మోత మోగిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దుయ్యబట్టారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు చేసిన అవినీతి, అక్రమాలకు, ఆయన మామ ఎన్టీఆర్‌కు చేసిన నమ్మక ద్రోహానికి ఆయనను నడిరోడ్డుపై ఉరితీసినా తప్పులేదన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో స్కిల్ స్కాంలో రూ.241 కోట్లు దోచుకున్నారన్నారు. ఈ విషయంపై సీఐడీ అధికారులు అన్ని కోణాల్లో విచారించి నివేదికను తయారు చేశారని, అందులో చంద్రబాబు హస్తం ఉందని తేలడంతో సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారని తెలిపారు. ప్రజలను మోసగించడంలో ఆయన సిద్ధహస్తుడన్నారు. చంద్రబాబు అవినీతి అక్రమాలకు పాల్పడకపోతే రెండు ఎకరాల నుంచి రూ.4 లక్షల కోట్లకు అధిపతి ఎలా అయ్యారో చెప్పాలన్నారు. ప్రజాధనాన్ని దోపిడీ చేసిన ఆయన అవినీతిని ఆ పార్టీ నాయకులే తెలుసుకున్నారని, అందుకే టీడీపీ నాయకులు చంద్రబాబు అరెస్ట్‌పై స్పందించడం లేదన్నారు. 14 సంవత్సరాలు సీఎంగా పనిచేసిన ఆయన జీవితం కుట్రలు కుతంత్రాలతో సాగిందని దుయ్యబట్టారు.

జైల్లో రంభ, ఊర్వశి ఉంటారా ?

జైల్లో ఉన్న చంద్రబాబుకు దోమల బెడద ఉందని ఆయన సతీమణి అనడం దారుణమని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. జైల్లో దోమలు కాకుండా రంభ, ఊర్వశి ఉంటారా అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అరెస్ట్‌పై జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ప్రేమ ఒలకబోయడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపించండి

- రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరురూరల్: వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం నెల్లూరురూరల్ నియోజకవర్గం పరిధిలోని దొంతాలి గ్రామంలో రూ.4.5 కోట్లతో పలు రోడ్ల నిర్మాణానికి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నెల్లూరురూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తాను నెల్లూరు ఎంపీ స్థానానికి పోటీ చేస్తామని, ప్రజలు తమను గెలిపించాలని కోరారు. రూరల్ నియోజకవర్గంతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరురూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి 7 నెలల కాలంలోనే రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లకు పైగా నిధులు కేటాయించేందుకు కృషి చేశారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్యశిబిరాలు నిర్వహిస్తూ అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తోందని తెలిపారు. స్థానిక రైతులు చెరువు పూడికతీత పనులు చేయాలని కోరగా, తనవంతు సహకారం అందిస్తామని, నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.



దొంతాలిలో రైతుకు పాసుపుస్తకం అందజేస్తున్న ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడంతోపాటు అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరురూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. దొంతాలి అభివృద్ధికి తాను చేసిన కృషిని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాల ద్వారా అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని తెలిపారు. అభివృద్ధిలో నెల్లూరురూరల్ నియోజకవర్గాన్ని జిల్లాలో నంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పలువురు రైతులకు మంజూరైన పట్టాదారు పాసుపుస్తకాలను ఎంపీ ఆదాల, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మేయర్ స్రవంతి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుడు హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసం.. ఘటోత్సవం

పోలేరమ్మ జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. వెంకటగిరి జనసంద్రంగా మారింది. కిక్కిరిసిన వీధుల్లో పోలేరమ్మ ఘటం కదిలింది. పటిష్టమైన బందోబస్తు మధ్య సంప్రదాయబద్ధంగా ఈ ఘటోత్సవం ఆరంభమైంది. ఐదు రోజులపాటు సాగే ఈ జాతరలో వీఐపీ పాసులు రద్దు చేస్తున్నట్లు కమిటీ ప్రకటించింది. సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం సులభతరం చేసింది.

- అశేష జనసందోహం నడుమ కదిలిన ఘటం
- వెంకటగిరి పోలేరమ్మ జాతర ప్రారంభం
- వీఐపీ పాసులు రద్దు : నేదురుమల్లి



ఘటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

సైదాపురం/వెంకటగిరిరూరల్ : అశేష భక్త జనసందోహం నడుమ అత్యంత వైభవంగా పోలేరమ్మ ఘటోత్సవం ఆదివారం ప్రారంభమైంది. వెంకటగిరి జాతరలో మొదటి ఘట్టంగా భావించే ఈ ఘటోత్సవానికి భక్తులు తరలిరావడంతో పట్టణం జనసంద్రమైంది. ఏ వీధి చూసినా జనంతో కిక్కిరిసిపోయింది. గాలిగంగుల దేవస్థానం నుంచి కదిలిన ఘటం మధ్యాహ్నం 3 గంటలకు జీనిగల వారి వీధికి చేరుకుంది. అక్కడ మండపంలో సంప్రదాయబద్ధంగా తప్పెట్లు, తాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య ఘటం ఊరేగింపు ప్రారంభమైంది. అక్కడి నుంచి పోలేరమ్మవీధి, రాజావీధి మీదుగా పోలేరమ్మ దేవస్థానం వద్దకు చేరుకుంది. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం రాజాల భవనంలోకి ప్రవేశించింది. సంప్రదాయబద్ధంగా రాజాల అనుచరులు ఘటానికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అమ్మవారికి బలి ఇచ్చే దున్నపోతును ఘటం వెంటే ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. ఈ జాతరలో 4, 5 తేదీల్లో నిర్వహించే ఉత్సవమే ప్రధానం. ప్రభుత్వం ఈ జాతరను రాష్ట్ర పండగగా ప్రకటించడంతో దీనికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఘటోత్సవ ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, పోలేరమ్మ గుడి దేవస్థానం మాజీ అధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. బందోబస్తు విధుల్లో 8 మంది ఎస్సైలు, ముగ్గురు సీఐలు, 80 మంది సిబ్బందిని నియమించినట్లు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మూడు ఫైరింజన్లు, 108 వాహనాలను ఆలయ పరిసరాల్లో అందుబాటులో ఉంచారు.



దున్నపోతును ఊరేగిస్తున్న దృశ్యం

చరిత్రలో నిలిచిపోయేలా జాతర

రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా వెంకటగిరి పోలేరమ్మ జాతరను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వెంకటగిరి పోలేరమ్మ జాతర నిర్వహణపై వివిధ శాఖల అధికారులు ఆహ్వాన కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నేతలతో శాంతి సంఘం సమావేశాన్ని నిర్వహించారు. నేదురుమల్లి మాట్లాడుతూ జాతరలో అమ్మవారి దర్శనం సులభతరం చేస్తూ, సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి జాతరను రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో మొదటిసారిగా ఈ జాతరను కనీవినీ ఎరుగని రీతిలో వైభవోపేతంగా నిర్వహిస్తామన్నారు. జాతరలో భాగంగా ఐదు రోజులపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఈసారి క్యూలో మజ్జిగ ప్యాకెట్లను అందిస్తామన్నారు. ఈ ఏడాది వీఐపీ పాసులను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం ఉచిత దర్శనం క్యూతోపాటు రూ.200, రూ.500 దర్శన క్యూలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతరలో ఆర్భాటాలకు తావివ్వకుండా ఆచారాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, తహసీల్దార్ పద్మావతి, ఎస్‌ఐ నరసింహారావు, ఈఓ శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ వెంకట్రామయ్య, పట్టణ అధ్యక్షుడు ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ బాలయ్య, ఆహ్వాన కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

సీనియర్ ఓటర్లకు ప్రత్యేక సదుపాయాలు



సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు

తోటపల్లిగూడూరు: ఎన్నికల సమయంలో 80 ఏళ్లు నిండిన సీనియర్ ఓటర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలు కలిపిస్తున్నట్లు తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్, సర్వేపల్లి నియోజకవర్గ ఎన్నికల అధికారి ఓబులేసు పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం 80 ఏళ్లు నిండిన ఓటర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఏర్పాటులో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. దశాబ్దాలుగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారికి మరింత ప్రాధాన్యం ఉంటుందన్నారు. భారత ఎన్నికల సంఘం అక్టోబర్ 1న వృద్ధుల దినోత్సవం సందర్భంగా సీనియర్ ఓటర్లకు సన్మానించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రాయపు శీనయ్య, డిప్యూటీ తహసీల్దార్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు లారీలు ఢీ-డ్రైవర్ దుర్మరణం



లాల్‌షా రాజ్‌పుత్ మృతదేహం

కావలి: మండలంలోని అల్లిగుంటపాళెం బ్రిడ్జి సమీపంలో ఆదివారం జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఢిల్లీకి చెందిన డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. కావలి రూరల్ ఎస్సై శెట్టిపల్లి సుమన్ తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు వైపు వెళ్తున్న లారీని వెనుకగా అతివేగంగా వస్తున్న మరో లారీ అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో వెనుక లారీ డ్రైవర్ లాల్‌షా రాజ్‌పుత్ (53)కు బలమైన రక్త గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. రూరల్ ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న గుర్తింపు కార్డుల ఆధారంగా ఓక్లా పేజ్-2 ఇండస్ట్రియల్ ఏరియా, సౌత్ ఢిల్లీకి చెందిన వాడిగా గుర్తించారు. మృతదేహాన్ని కావలి ఏరియా ఆస్పత్రికి తరలించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఓట్లొస్తేనే గుర్తొస్తామా సారూ

- నెల్లూరులో నారాయణను నిలదీసిన ప్రజలు

నెల్లూరు సిటీ: ఓట్లొస్తేనే తాము గుర్తొస్తామా..కరోనా సమయంలో తమరు ఎట్టబోయారు సారూ..అప్పుడు మేం గుర్తుకురాలేదా అంటూ మాజీ మంత్రి పీ నారాయణను నగర ప్రజలు నిలదీశారు. ఆదివారం రాత్రి నగరంలోని మూలాపేట ప్రాంతంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా నారాయణ పర్యటించారు. ప్రజలకు అభివాదం చేస్తుండగా స్థానికులు అయ్యగారు బాగున్నారా..నమస్కారం సారూ..చాలారోజుల తర్వాత వచ్చారు. కరోనా సమయంలో తమరు ఎట్టబోయారు సారూ.. తాము ఆస్పత్రికి వచ్చి చాలా ఇబ్బందులు పడ్డాం..మీ కోసం పనిచేశాం..కనీసం మమ్మల్ని చూసే దిక్కులేదా అంటూ నిలదీశారు. స్థానికులకు సమాధానం చెప్పలేక నారాయణ మొహం చాటేసే ప్రయత్నం చేయగా, మళ్లీ ఎప్పుడొస్తారూ సారు..ఓట్లప్పుడే గుర్తొస్తామా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊహించని ఈ పరిణామంతో ఖంగుతిన్న నారాయణ అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు.

విద్యార్థిని అదృశ్యం

దుత్తలూరు: తొమ్మిదో తరగతి విద్యార్థిని అదృశ్యమైన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు..వింజమూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని తొమ్మిదో తరగతి చదువుతోంది. స్వగ్రామంలో సరిగా చదవకపోవడంతో తల్లిదండ్రులు దుత్తలూరు మండలంలోని ఓ గ్రామంలో నివాసం ఉంటున్న తన మేనమామ ఇంటి వద్ద ఉంచి దుత్తలూరు ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నారు. శుక్రవారం రోజులాగే పాఠశాలకు వచ్చిన సదరు విద్యార్థిని సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్లలేదు. దీంతో మేనమామ కుటుంబ సభ్యులు విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అనంతరం తల్లిదండ్రులు, మేనమామ కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో దుత్తలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విద్యార్థిని కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. కాగా సదరు విద్యార్థిని పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడి సెల్ ఫోన్ నుంచి ఓ వ్యక్తికి ఫోన్ చేసి అదృశ్యమవడంతో సదరు టీచర్ తన ఫోన్‌లోని నంబర్‌ను డిలీట్ చేసి అదృశ్యమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బైక్‌ను ఢీకొన్న కారు

- ఒకరికి తీవ్రగాయాలు

ఆత్మకూరు: బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. ఈ ఘటన మున్సిపల్ పరిధిలోని టిడ్కో ఇళ్ల వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన వెంకటేశ్వర్లు బైక్‌పై టిడ్కోగృహాల్లో నివాసం ఉంటున్న తన బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి నెల్లూరు వెళ్తూ హైవేను క్రాస్ చేస్తున్న క్రమంలో మర్రిపాడు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. కారులోని బెల్లూన్లు తెరుచుకోవడంతో అందులోని ఇద్దరు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు ఆత్మకూరు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 118
బ్రాయిలర్ చికెన్	: 226
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 250
లేయర్ చికెన్	: 200



అవ్వాతాతా.. బాగున్నారా..

జిల్లా వ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీ ఆదివారం ప్రారంభమైంది. ఆదివారం సెలవుదినమైనప్పటికీ వలంటీర్లు వేకువజామునే లబ్ధిదారుల ఇళ్లకు చేరుకుని పింఛన్లు పంపిణీ చేశారు. అవ్వా..తాతలను పలుకరించి యోగక్షేమాలను తెలుసుకున్నారు. -సాక్షి నెట్‌వర్క్



నెల్లూరులో వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్



నెల్లూరులో పింఛన్ అందజేసేందుకు చేనేత కార్మికుడు టీ గోవిందయ్య నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ నాగలక్ష్మి



కలిగిరిలో పుల్లమ్మకు నగదు ఇస్తున్న వలంటీర్ మౌనిక



సంగం : మర్రిపాడులో రమణమ్మకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ పవన్

నెల్లూరు బ్రాండ్ వరి వంగడాలు

నెల్లూరు వరి పరిశోధనా స్థానంలో నూతన వంగడాల సృష్టి

- ఇప్పటికే 28 రకాలను అందించిన శాస్త్రవేత్తలు
- తాజాగా 'ఎన్‌ఎల్‌ఆర్ 3238' రకం మార్కెట్లోకి
- జింక్ శాతం ఎక్కువగా ఉండడం ప్రత్యేకత
- నెల్లూరు మసూరి నాలుగు రాష్ట్రాల్లో అధికంగా సాగు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు సాగిస్తూ కొత్త రకం వరి వంగడాలను సృష్టిస్తున్నారు. ఇక్కడ 1948 నుంచి వరి వంగడాలపై పరిశోధనలు సాగిస్తుండగా, ఇప్పటి వరకు 28 రకాల కొత్త వంగడాలను శాస్త్రవేత్తలు రూపొందించారు. ప్రధానంగా 1961 నుంచి పరిశోధనలను కొత్తపుంతలు తొక్కిస్తూ కొత్త వంగడాలను రైతులకు అందించారు. ఈ వంగడాలు నెల్లూరు బ్రాండ్‌గా నిలుస్తున్నాయి.

అధిక జింక్ శాతంతో కొత్త వంగడం సృష్టి

నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు గత మూడేళ్ల నుంచి ఎంతో కష్టపడి ఎన్‌ఎల్‌ఆర్ 3238 రకం కొత్త వంగడాన్ని మార్కెట్లోకి తీసుకొచ్చారు. జింక్ శాతం అధికంగా ఉండడం ఈ వంగడం ప్రత్యేకత. సాధారణ వంగడాల్లో జింక్ 18 శాతం పీపీఎం ఉండగా, ఎన్‌ఎల్‌ఆర్ 3238లో 24 శాతం పీపీఎంగా ఉంటుందని నిర్ధారించారు. ఈ వంగడం పంట కాలం 125 నుంచి 130 రోజులు. రబీ, ఖరీఫ్ రెండు సీజన్‌ల్లోనూ సాగుకు అనుకూలం. ఇప్పటికే ఈ వంగడాన్ని మినీకిట్ల రూపంలో రైతులకు పంపిణీ చేసి సాగుచేసి విజయవంతమయ్యారు.



వరి పైరు(ఫైల్)



నెల్లూరులోని వ్యవసాయ పరిశోధనా స్థానం

తొమ్మిది వంగడాలు బహుళ ప్రాచుర్యం

నెల్లూరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో సృష్టించిన కొత్త వంగడాల్లో తొమ్మిది రకాలు బహుళ ప్రాచుర్యం పొందాయి. ప్రధానంగా నెల్లూరు మొలగొలకులు (ఎన్‌ఎల్‌ఆర్ 9674), నెల్లూరు పార్థివ (ఎన్‌ఎల్‌ఆర్ 33892), నెల్లూరు మసూరి (34449), నెల్లూరు శ్వేత (ఎన్‌ఎల్‌ఆర్ 40024), నెల్లూరు భరణి (ఎన్‌ఎల్‌ఆర్ 30491), నెల్లూరు సోమశిల (ఎన్‌ఎల్‌ఆర్ 33358), నెల్లూరు ధాన్యరాశి (ఎన్‌ఎల్‌ఆర్ 3354), నెల్లూరు సోనా (ఎన్‌ఎల్‌ఆర్ 3041), నెల్లూరు స్వర్ణముఖి (ఎన్‌ఎల్‌ఆర్ 145) రకాలు అధికంగా సాగుబడిలో ఉన్నాయి.

నెల్లూరు మసూరి నాలుగు రాష్ట్రాల్లో సాగు

నెల్లూరు శాస్త్రవేత్తలు సృష్టించిన నెల్లూరు మసూరి రకం ధాన్యం నాలుగు రాష్ట్రాల్లో సాగుచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అధికంగా సాగు చేస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోనూ అక్కడక్కడా సాగు చేస్తుండడం విశేషం.

శాస్త్రవేత్తల కృషికి హ్యాట్సాఫ్

జిల్లాలోనే కాకుండా అన్ని ప్రాంతాల రైతులతో పాటు వినియోగించే వారిని దృష్టిలో ఉంచుకుని నెల్లూరు శాస్త్రవేత్తలు కొత్త వంగడాలను సృష్టిస్తున్నారు. పూర్తిస్థాయిలో అన్ని రకాల ప్రయోగాలు పూర్తి చేసి కొత్త వంగడాలను మార్కెట్లోకి విడుదల చేసేందుకు మూడు నుంచి ఆరేళ్లకు పైగా పడుతుంది. ఎంతో నైపుణ్యం,ఓర్పుతో ఎప్పటికప్పుడు అన్ని రకాల పరీక్షలు చేస్తూ నూతన వంగడాలను అందించే శాస్త్రవేత్తలకు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.

నెల్లూరు పేరు నలుమూలలా..



నెల్లూరు శాస్త్రవేత్తలు ఎన్నో రకాల కొత్త వంగడాలను రూపొందించి రైతులకు అందించారు. మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైతులు మన శాస్త్రవేత్తలు అందించిన వాటినే ఎక్కువగా వినియోగిస్తున్నారు. కొత్త వరి వంగడాలతో నెల్లూరు పేరును నలుమూలలా విస్తరింపజేస్తున్న శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు.

-వీ చెన్నారెడ్డి, ఖాన్‌సాహెబ్‌పేట, మర్రిపాడు మండలం

నూతన వంగడాల సృష్టిపై ప్రత్యేక దృష్టి



జిల్లాలోని రైతుల అవసరాలకు అనుగుణంగా నూతన వంగడాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారించి పరిశోధనలు చేపడుతున్నాం. నూతన వంగడాన్ని మార్కెట్లోకి తీసుకురావాలంటే మూడు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుంది. అప్పటి వరకు అని విధాలుగా శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగించి విజయవంతమైతేనే మార్కెట్‌లోకి తీసుకురావడం జరుగుతుంది. దీని వెనుక ఏళ్ల తరబడి శాస్త్రవేత్తల కృషి ఉంటుంది.

-వినీత , ప్రధాన శాస్త్రవేత్త

పూర్తిస్థాయిలో పరీక్షలు



నూతన వరి వంగడాలను మార్కెట్లోకి విడుదల చేసే ముందు పూర్తిస్థాయిలో పరీక్షలు చేస్తాం. వివిధ పద్ధతుల్లో వేసి దిగుబడులు పరిశీలిస్తాం. రైతులతోనూ ప్రయోగాత్మకంగా సాగుచేయిస్తాం. ధాన్యాన్ని అనేక రకాలుగా ల్యాబ్‌ల్లో పరీక్షలు చేస్తాం. అనంతరం ముందుగా సాగుచేసిన పద్ధతిలో నిర్ధారించిన తరువాత రైతులకు అందజేస్తాం.

-లక్ష్మి, శాస్త్రవేత్త

శాస్త్రవేత్తల శ్రమ వెలకట్టలేనిది



కొత్తరకం వరి వంగడాలను రైతులకు అందించడంలో శాస్త్రవేత్తల శ్రమ వెలకట్టలేనిది. రైతులతో పాటు వినియోగించే వారిని దృష్టిలో పెట్టుకుని విత్తనాన్ని తయారు చేయడం అంత సులభం కాదు. ఏళ్ల తరబడి ప్రయోగాలు చేసి వంగడాలను సృష్టిస్తున్న శాస్త్రవేత్తలకు అభినందనలు.

-బీ భాస్కర్‌రెడ్డి, రైతు, మనుబోలు

సమాజాన్ని స్వచ్ఛతవైపు నడిపించాలి

- జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్

ఇందుకూరుపేట: ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రతను పాటించి సమాజాన్ని స్వచ్ఛతవైపు నడిపించాలని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు మండలంలోని మైపాడు సముద్రతీరంలో 'ఏక్ తారిఖ్ ఏక్ గంట' స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీ పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైపాడులో సుమారు 500 మంది పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను విధిగా పాటించాలన్నారు. పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తొలుత గ్రామం నుంచి సముద్రతీరం వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. అనంతరం స్వచ్ఛత హీ ప్రతిజ్ఞ చేసి తీరంలోని వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, జెడ్పీ సీఈఓ చిరంజీవి, జేడీఏ సుధాకర్‌రాజు, నాబార్డ్ డీడీ ఎం రవి సింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మైపాడు బీచ్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ కూర్మనాథ్

రేపో మాపో నారాయణ కూడా..



- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జైల్లో ఉన్న చంద్రబాబును ఇటీవల మాజీ మంత్రి నారాయణ ఎందుకు కలిసివచ్చారో అందరికీ తెలుసునని, అమరావతిలో పేదల అసైన్డ్ భూములను అందరూ కలిసి కాజేసిన నేపథ్యంలో ఆయన ఏది చెబితే అదే చెప్పేందుకు ఒక అవగాహన కోసం వెళ్లి కలిశారని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ దుయ్యబట్టారు. నగరంలోని విజయమహల్‌గేట్ సమీపంలో ఉన్న ఎంసీఎస్ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపోమాపో మాజీ మంత్రి నారాయణను కూడా సీఐడీ అరెస్ట్ చేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదన్నారు. జైల్లో చంద్రబాబును కలిసి బయటకు వచ్చాక తాము వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ గురించి మాట్లాడామని నారాయణ చెప్పడం హాస్యాస్పదమన్నారు. అమరావతిలో రూ.800 కోట్ల విలువ చేసే పేదల భూమి కాజేసిన నారాయణ సత్యహరిశ్చంద్రుడిలా మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు స్కిల్ స్కాంపై విచారణ జరుగుతోందని, భవిష్యత్‌లో ఇంకా భయంకరమైన నిజాలు బయటకొస్తాయన్నారు. గతంలో కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభంను అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టిన వారు, ఆయన కుటుంబం నిరసన కార్యక్రమాలు చేస్తే ఎగతాళి చేసిన వారు ఇప్పుడు అదే తరహాలో కార్యక్రమాలు చేపట్టడం చూస్తుంటే ఇది దేవుడి స్క్రిప్టే అని అర్థమవుతుందన్నారు. చంద్రబాబు అరెస్ట్ అయితే నెల్లూరులోని టీడీపీ నాయకుల్లో ఎక్కడా బాధ కనిపించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. వైద్యశిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. నగర నియోజకవర్గంలో రూ.10 కోట్లతో నూతన అర్బన్ హెల్త్‌సెంటర్‌లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసు జీపును ఢీకొన్న లారీ

- ఇద్దరు ఎస్సైలు, డ్రైవర్‌కు గాయాలు

ఆత్మకూరు: పోలీసు జీపును వెనుకగా లారీ ఢీకొనడంతో ఇద్దరు ఎస్సైలు, జీపు డ్రైవర్ గాయపడ్డారు. ఈ ఘటన ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..ఏఎస్‌పేట ఎస్సై నరేష్, మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి పోలీసు శిక్షణ నిమిత్తం ఏలూరుకు వెళ్లారు. శిక్షణ ముగించుకుని వస్తూ నెల్లూరులో రైలు దిగి పోలీసు జీపులో ఆత్మకూరు బయలుదేరారు. మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి సమీపంలోని దాబా వద్ద నెల్లూరు-ముంబయి రహదారి పక్కన పోలీసు జీపును నిలిపి ఉండగా, వెనుకగా వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో జీపు పక్కనే ఉన్న చెట్లల్లోకి దూసుకుపోయింది. జీపులోని ఇద్దరు ఎస్సైలతో పాటు డ్రైవర్ రమణకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఆత్మకూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఏఎస్‌పేట ఎస్సై నరేష్‌కు తీవ్రగాయాలు కావడంతో నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ జీ వేణు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ప్రైవేట్ హెల్పర్‌కు తీవ్రగాయాలు

వరికుంటపాడు: విద్యుదాఘాతంతో ఓ ప్రైవేట్ హెల్పర్ తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని జడదేవిలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు..చెన్నంపల్లికి చెందిన ఆదాము ప్రైవేట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. జడదేవికి చెందిన కుందూరు నారాయణ పొలాల్లోని విద్యుత్ తీగను కట్ చేసేందుకు పిలవడంతో అక్కడికి వెళ్లాడు. ఇద్దరూ కలిసి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ లైన్‌కు సరఫరాను నిలిపివేశారు. అయితే డీపీ సరిగా పడకపోవడంతో విద్యుత్ సరఫరా ఆగలేదు. కానీ ఆదాము మాత్రం విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని భావించి స్తంభం మీదకు ఎక్కి విద్యుత్ తీగను కటింగ్ ప్లయర్‌తో కట్ చేశాడు. కట్ చేసిన తీగ ఆదాంపై పడడంతో విద్యుదాఘాతానికి గురై శరీరమంతా గాయాలయ్యాయి. స్తంభం పై నుంచి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. విద్యుత్ అధికారుల అనుమతి లేకుండా ప్రైవేట్ విద్యుత్ హెల్పర్‌తో తీగ ఎలా కట్ చేయిస్తారూ అంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ట్రాక్టర్ నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: ట్రాక్టర్‌పై వెళ్తూ జారిపడి వ్యక్తి గాయపడిన ఘటన వెంకటాచలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కసుమూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ ప్రదీప్‌కుమార్ ట్రాక్టర్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు జారిపడడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ. 65
సన్నవి	: రూ. 30
పండ్లు	: రూ.7



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR

■ 10th/Inter,BA,B.Com,B.Sc,BBA,BCA, BLIS,MA,M.Com,MSC,MCA,MBA,MLIS Dip, B.Tech,M.Tech, M.Phil, Ph.D., BNYS, BPT (Discontinued), 9030030125. [T-2201]

■ **Last Chance:** 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA Regular/lateral entry.9381287629 [T-4623]

REAL ESTATE

■ ప్లాట్లు కొనబడును. అపోలో, పార్థసారథి, ముత్తుకూరు రోడ్ లేఅవుట్లలోని ప్లాట్లు మరియు ఇతర ప్లాట్లు కొనబడును. వివరాలకు సంప్ర : 93464 48054, 79812 46665. [N-1205770]

■ నెల్లూరు నగర పరిధిలో అతి తక్కువ ధరలకే కమర్షియల్ బిట్లు, ఇంటి స్థలాలు,పొలములు, అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్స్ అమ్మబడును.సంప్రదించండి: 98664 35396, 96037 90079. [NA-297]

HOUSE FOR SALE

■ కొత్తగా కట్టబడిన ఇండిపెండెంట్ హౌస్ ఇన్ గేటెడ్‌కమ్యూనిటీ, నియర్ KGKకళ్యాణమండపం, కాకుపల్లి. 27.5 అం॥లో 22 అం॥ల కట్టుబడి గల ఇల్లు అమ్మబడును.9100485916,7401459200. [NA-10947]

PLOT FOR SALE

■ నరుకూరు సెంటర్‌కు అతి సమీపంలో అంకణం 80వేలకే NUDA Approved ప్లాట్‌లు అమ్మబడును. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. సంప్రదించండి: 62814 11178, 91214 52347. [NA-11543]

■ బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ, కట్టుబోడిపాలెం MAIN ROAD, కట్టుబోడిపాలెం 78 అంకణములు స్థలం అమ్మబడును. SUITABLE FOR SHOPS, GODOWNS ETC. CON : 9494231604. [C-776991]

■ పార్థసారథి లేఅవుట్‌లో ప్లాట్-17, సింధు తపోవన్‌ప్లాట్-3,గుండ్లపాళెం రోడ్డులో ప్లాట్-20, గొలగమూడి రోడ్డు, సత్యంజీ లేఅవుట్ ప్లాట్-50, వెంకటేశ్వరపురం పాలిటెక్నిక్ కాలేజి ఎదురు లేఅవుట్‌లో 4 ప్లాట్లు అమ్మబడును. 98664 10052. [N-1205772]

TO-LET

■ నెల్లూరు వనంతోపు పరిసర ప్రాంతాల్లో ప్రముఖ విద్యా సంస్థ కొరకు అన్ని వసతులు గల 10నుండి 15వేల Sq.ft భవనం అద్దెకు కావలెను. సంప్రదించండి: 9177773970. [NA-11542]

■ గోడౌన్‌పాయింట్‌కి, పెద్దపడుగుపాడు GNT రోడ్ అనుకుని 7500 sqft (50×50) కమర్షియల్ గోడౌన్ 1ఎకరా ఖాళీ స్థలం, పుష్కల నీటి సౌకర్యంతో బాడుగకు కలదు. 7013332153, 9701515664. [NA-10545]

ప్రకటన గోరంత
స్పందన కొండంత

WANTED

■ **Wanted Telecallers (Female)** Working in Nellore. For More Details Contact: 9701201403, 9666987978. [NA-11538]

■ **Freshers Required For Construction** & Interior Company Basic pay will be provided in training Period Qlf: ITI / B.Tech Civil / Architecture. Ph:8328311636, 9959675360. [NA-5244]

■ కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు, ప్రముఖుల ఇళ్ళ వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కావలెను. Sal: 14-20K వసతి + భోజనం, విజయవాడ ✆ 91608 35559, 78158 35561 [B-385]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221757]

■ మా హాస్పిటల్ నందు పని చేయుటకు M/F అసిస్టెంట్స్ కావలెను. అర్హత: 10/ఇంటర్. శ్రీ కృష్ణ ఆయుర్వేద హాస్పిటల్, సండే మార్కెట్ లైన్, నెల్లూరు.సంప్రదించండి: 9100295397. [N-1189097]

■ ప్రముఖ కంపెనీ పూజ ప్రొడక్ట్ మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, స్త్రీ/పు, వర్కర్స్, హెల్పర్స్ కావలెను. సంప్రదించండి: 8297751599, 8886076703. [N-785291]

■ నెల్లూరు సిటీలో రన్నింగ్‌లో ఉన్న సూపర్ మార్కెట్ అమ్మబడును లేదా పెట్టుబడి పెట్టగల వారికి పార్టనర్‌షిప్ ఇవ్వబడును. ఆసక్తి గల వారు సంప్రదించండి సెల్ : 70326 10569. [NA-5921]

■ శ్రీ మ్యారేజ్ కన్సల్టెన్సీ నందు పని చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. అడ్రస్: కొండాయపాళెం గేట్ ఎదురువీధి, నెల్లూరు. సంప్రదించండి: 88855 67277, 89850 48177. [NA-5917]

■ నెల్లూరు,మాగుంట లేఅవుట్‌లోని క్లాసిక్ మార్కెటింగ్ టైల్స్ & శానిటరీవేర్‌లో సేల్స్ బాయ్స్ / గర్ల్స్,మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ & గోడౌన్‌లో డెలివరీ బాయ్స్ కావలెను.6301281399,9491271139. [NA-22754]

■ **Digital Marketing** ఏజన్సీ నందు పని చేయుటకు Photoshop Designers (M/F) కావలెను.Ex: 1-2Years,F/P Time. పొగతోట నెల్లూరు. 9160200800, 92462 22400 [NA-10546]

■ ఫ్రెష్ M/F గ్రాడ్యుయేట్స్ & బంగారంలో అనుభవం కలిగిన అప్రైజర్ నెల్లూరులో ఉండే ప్రముఖ మా బంగారం సంస్థలో పని చేయుటకు కావలెను. 08614065557,9150061325,9150011538. [NA-11541]

■ నెల్లూరు, హరనాథపురం మెయిన్‌రోడ్‌లో AMR పెట్రోల్ బంకు నందు డే&నైట్‌షిఫ్ట్‌లో పని చేయుటకు యువతి/యువకులు & ఎయిర్ బాయ్స్ కావలెను. సంప్ర: 8985264143, 9494797343. [NA-5914]

■ నెల్లూరు మినిబైపాస్‌రోడ్డు TDP ఆఫీసు ఎదురుగా HPCL పెట్రోల్ బంకులో పని చేయుటకు పంపు బాయ్స్ కావలెను. జీతం: 12,000/-. సంప్రదించండి: 8919923469, 8341828889. [NA-22747]

■ బ్యాంక్‌లోన్స్ ప్రాసెస్ నందు TeleCaller కావలెను. Married Female టార్గెట్స్ లేవు. జీతం: 12,000/-.ట్రంక్‌రోడ్, నెల్లూరు. వివరములకు సంప్రదించండి: 88858 02000. [NA-22719]

■ ప్రముఖ MNC కంపెనీ నందు పని చేయుటకు LIC ఏజెంట్స్, రిటైర్డ్ పర్సన్స్ (స్త్రీ/పు) కావలెను. పెట్టుబడి లేకుండా నెలకు లక్ష వరకు సంపాదించే అవకాశం. సంప్ర: 9160509670. [NA-11540]

■ నెల్లూరు టౌన్ పరిధిలో ప్రముఖ సెక్యూరిటీ ఏజెన్సీకి ఫీల్డ్ అనుభవం కల్గివున్న ఫీల్డ్ ఆఫీసర్స్ (M/F) కావలెను. వ:50 సం.లోపు, 10th/ ఇంటర్ / డిగ్రీ, జీ: 20,000, 7680848899. [T-4624]

■ నవ్యసాయి ప్రాజెక్ట్స్ ప్రై.లి. నందు పని చేయుటకు 50 మంది ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. శాలరీ + ఇన్సెంటివ్ కలవు. సంప్ర॥ 7093562030 [G-7711]

■ మెడికల్ ఏజెన్సీ నందు పని చేయుటకు బాయ్స్ కావలెను. అర్హత అవసరం లేదు. సంప్రదించండి:9704420704. [C-776984]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221732]

■ కన్సల్టెన్సీకాదు. VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP&డాక్టర్స్ కావలెను.జీ:12,000/- - 35,000/- ఫ్రీ రూమ్ + భోజనం. HYD. Ph: 7995984445. [HA-668]

■ ప్రముఖ విద్యా సంస్థలో పనిచేయుటకు స్వీపర్లు, స్కావెంజర్స్ మరియు వాచ్‌మెన్ వెంటనే కావలెను. జీతం: 7,500 నుండి 8,000 వరకు, సంప్ర. ఫోన్: 9573181969 [HA-193306]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.